మార్పు కోసం...

# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 195 03 బుధవారం, జనవరి 2023 పేజీలు: 4/వెల రూ5/-



విలేకరులు కావలెను

హైదరాబాద్, అమరావతి కేంద్రాలుగా నడుపబడుతున్న

మరో ఉదయం

(అక్రిడేషన్ కలిగి ఉన్న) తెలుగు దినపత్రికకు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు విలేకరులు కావలెను

మరిన్ని వివరాలకు సంపాదించండి

సెల్:9154842842


## సిఎం రేవంత్‌తో నీతి ఆయోగ్ ఛైర్మన్ భేటీ

రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని హామీ

నిధుల విడుదల...అభివృద్ధికి సహకరించాలన్న సిఎం రేవంత్

**హైదరాబాద్,జనవరి2(మరో ఉదయం):**



సచివాలయంలో నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ కుమార్ బేరి బృందం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్కలతో సమావేశమయ్యారు. రాష్ట్ర సమగ్ర ప్రగతి, అభివృద్ధి అంశాలు, విధాన కార్యక్రమాలు, సహకారంపై చర్చించారు. సమర్థవంతమైన పాలనకు మార్గదర్శక సూత్రంగా కో-ఆపరేటివ్ ఫెడరలిజం ప్రాముఖ్యతను సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. నీతి ఆయోగ్, రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న సవాళ్లు పరిష్కరించడానికి కలిసి పనిచేయడానికి అంగీకరించాయి. రాష్ట్రాభివృద్ధి, కీలక రంగాలకు సంబంధించి ప్రాధాన్యతలను, రాష్ట్ర అవసరాలను ముఖ్యమంత్రి నీతి ఆయోగ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్ర అభివృద్ధికి తమవంతుగా సహకారమందిస్తామన్నారు. కేంద్రం నుంచి అందవలసిన న్యాయమైన కేటాయింపులు, వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం రాష్ట్రానికిచ్చే నిధులు, వనరుల మంజూరు గురించి చర్చించారు. ముఖ్యమంత్రి నీతి ఆయోగ్ దృష్టికి తీసుకొచ్చిన అంశాల్లో 16వ ఆర్థిక సంఘం ద్వారా ఇచ్చే నిధుల కేటాయింపు పెరిగేలా చూడాలన్నారు. ఆరోగ్యం, విద్యలో మౌలిక సదుపాయాల కోసం నిధులు కేటాయింపు పెంచాలన్నారు.

## పార్లమెంట్ ఎన్నికలపై బిఆర్ఎస్ దృష్టి

నేటినుంచి పార్టీ నేతలతో కెటిఆర్ సమీక్ష

వచ్చే లోక్‌సభలో గెలుపే లక్ష్యంగా భేటీలు

**హైదరాబాద్,జనవరి2(మరో ఉదయం):**



## బిజెపిలో లోక్‌సభ టిక్కెట్లకు డిమాండ్

పార్టీ కార్యాలయానికి పులువురు నేతల క్యూ

టిక్కెట్ల కేటాయింపు అధిష్టానందేనన్న కిషన్ రెడ్డి



**హైదరాబాద్,జనవరి2(మరో ఉదయం):**

పార్లమెంట్ ఎన్నికలపై బీజేపీ ఫోకస్ పెట్టడంతో.. టిక్కెట్లు ఆశిస్తున్న పలువురు నేతలు పార్టీ కార్యాలయానికి క్యూ కట్టారు. తాము ఓటీ చేస్తే స్థానాల్లో టిక్కెట్ వచ్చేలా చూడాలని పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డికి వినతిపత్రాలు సమర్పించారు. కసరత్తులో భాగంగానే ఆయా లోక్‌సభ స్థానాల్లో బలమున్న నేలను బరిలో దింపేందుకు రంగం సిద్ధం చేసుకుంటుంది. 5 రోజుల క్రితం పార్లమెంట్ ఎన్నికలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కేడర్‌కి దిశానిర్దేశర చేసిన విషయం తెలిసిందే. ఈ సారి తెలంగాణలో అత్యధిక ఎంపీ స్థానాలు గెలవాలని అమిత్ షా తెలంగాణకు వచ్చి కమలం కేడర్‌కి చెప్పారు. ఇందులో భాగంగానే బీజేపీలో బలంగా ఉన్న అభ్యర్థులపై బీజేపీ హైకమాండ్ దృష్టి సారించింది. దీంతో నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి నాయకుల తాకిడి మొదలైంది.నాయకుల వరుసబెట్టి బీజేపీ ఆఫీస్‌కి క్యూలు కడుతున్నారు. బీజేపీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని పార్లమెంట్ టికెట్ ఆశావాహులు కలుస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం ఇవ్వాలని మాజీ ఎంపీ చాడా సురేష్‌రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, రాణీ రుద్రమదేవి కోరారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ సీటును చాడా సురేష్‌రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, పన్నాల హరీష్‌రెడ్డి ఆశిస్తున్నారు. బీజేపీలో మల్కాజ్‌గిరి సీటుకు ఫుల్ డిమాండ్ ఉంది. మల్కాజ్‌గిరి నుంచి పోటీచేస్తానని ఇప్పటికే మాజీ మంత్రి ఈటల రాజేందర్ ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు భువనగిరి నుంచి పోటీకి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ రెడీ అవుతున్నారు. కిషన్‌రెడ్డిని బూర నర్సయ్య గౌడ్ కలిశారు. అయితే లోక్ సభ అభ్యర్థుల ఎంపిక బాధ్యత పార్టీ అధిష్టానానిదేనని బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్ రెడ్డి అన్నారు. సిట్టింగులను మార్చే ప్రసక్తే లేదని క్లారిటీ ఇచ్చారు. సికింద్రాబాద్ నుంచి తాను, కరీంనగర్ నుంచి బండి సంజయ్, నిజామాబాద్ నుంచి అర్వింద్, ఆదిలాబాద్ నుంచి సోయం బాపురావ్ పోటీలో ఉంటున్నట్టు క్లారిటీ ఇచ్చారు. మంద కృష్ణ మాదిగ పోటీపై ఎక్కడా చర్చ జరగలేదని తెలిపారు. బీజేపీ శాసన సభా పక్ష నేత ఎంపికపై ఢిల్లీ నుంచి అబ్జర్వర్లు వచ్చాక క్లారిటీ వస్తుందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీ నినాదం వర్కవుట్ అయ్యిందని, ఓట్లశాతం గణనీయంగా పెరిగిందని చెప్పారు. ఫిబ్రవరి 28వ తేదీగానీ, మార్చి మొదటి వారంలో గానీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రజాపాలన కొత్త మురిపెంలా ఉందంటూ సెటైర్ వేశారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు

# కాంగ్రెస్‌తోనే నా నడక

పార్టీలో చేరడం ఖాయం

కాంగ్రెస్ పార్టీ మాత్రమే దేశానికి రక్ష

ఇడుపులపాయ వద్ద తండ్రి సమాధి వద్ద నివాళి

కొడుకు పెళ్లి పత్రికను సమర్పించి శ్రద్ధాంజలి

త్వరలోనే వివరాలు తెలుస్తాయని షర్మిల వ్యాఖ్య

**కడప,జనవరి2(మరో ఉదయం):**




2 లో


## అయోధ్య ఆలయానికి రజనీకి ఆహ్వానం

**చెన్నై,జనవరి2(మరో ఉదయం):**

తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ కు అయోధ్య నుంచి ఆహ్వానం అందింది. రామ మందిర ప్రారంభోత్సవ కార్యక్రమానికి రజనీకాంత్ ను ఆహ్వానించినట్లుగా బీజేపీ నాయకుడు .అర్జునమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన కొన్నిఫోటోలను ట్విట్టర్ లో పోస్ట్ చేశారు. రజినీకాంత్ ను ఆహ్వానించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. జనవరి 22న అయోధ్యలో రామ మందిరం ప్రాణప్రతిష్ట కార్యకక్రమం జరగనుంది. ఈ వేడుకకు ప్రపంచ నలుమూలల నుంచి ప్రముఖులు హాజరుకానున్నారు. రజనీకాంత్‌తో పాటు, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీ, రతన్ టాటాలు కూడా ఆహ్వా?నం అందింది.అయోధ్యలోని రామ మందిర ఆలయంలో రామ్ లల్లా పట్టాభిషేకానికి ముహూర్తం ఖరారయ్యింది. జనవరి 22న మధ్యాహ్నం 12.20 గంటలకు రాముడి పట్టాభిషేక కార్యక్రమం జరగనుంది. ఈ విషయాన్ని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు. పట్టాభిషేకం తర్వాత హారతి, సూర్యాస్తమయం అనంతరం దీపాలను వెలిగిస్తారని వెల్లడించారు. రామ్ లల్లా ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. ప్రధాన వాస్తు శిల్పి ఆచార్య సత్యేంద్ర దాస్ ఈ విషయంపై స్పందిస్తూ.. రామ్ లల్లా విగ్రహం క్టంగ్÷న్‌ను ప్రధాని మోదీ మాత్రమే తొలగిస్తా రని తెలిపారు. అనంతరం రామయ్యకు కాటుక దిద్ది.. విగ్రహానికి బంగారు వస్త్రాలతో అలంకరిస్తామని వెల్లడించారు. ప్రత్యేక పూజలతో పాటు 56 నైవేద్యాలను సమర్పిస్తారని పేర్కొన్నారు. ప్రాణ ప్రతిష్ఠకు ముందు బాల రామయ్య విగ్రహా న్ని అయోధ్యలో ఊరేగింపునకు తీసుకువెళ్తారని చెప్పారు.



## దేశంలో పెరుగుతున్న కోవిడ్ కేసులు

### తాజాగా 263 కొత్త కేసులు నమోదు

**న్యూఢిల్లీ,జనవరి2(మరో ఉదయం):**

దేశ వ్యాప్తంగా కొవిడ్ సబ్ వేరియంట్ జేఎన్ 1 కేసులు పెరిగిపోతున్నాయి. తాజాగా 263 కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు తెలిపారు. వాటిలో సగానికిపైగా కేరళలోనే ఉన్నట్లు వివరించారు. పది రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలు ఇప్పటివరకు ఈ సబ్-వేరియంట్ ఉనికిని గుర్తించాయి.ఇండియన్ జెనోమిక్స్ కన్సార్టియం రిపోర్ట్ ప్రకారం... కేరళ (133), గోవా (51), గుజరాత్ (34), ఢిల్లీ (16), కర్ణాటక (8), మహారాష్ట్ర (9), రాజస్థాన్ (5), తమిళనాడు (4), తెలంగాణ (2), ఒడిశా (1) చొప్పున యాక్టివ్ కేసులున్నాయి. డిసెంబర్ లో తొలిసారి ఈ వేరియంట్ కేసుల్ని కనుక్కున్నారు. అయితే ఇది అంత ప్రమాదకరం కాదని వైద్యులు అంటున్నారు. ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన డేటా ప్రకారం దేశంలో 573 కొత్త కరోనావైరస్ కేసులు నమోదు కాగా, క్రియాశీల కేసులు సంఖ్య మొత్తంగా 4,565 గా ఉన్నాయి.

## నేడు పంచాయితీరాజ్ సదస్సు ముఖ్య అతిథిగా రానున్న చంద్రబాబు

**గుంటూరు,జనవరి2(మరో ఉదయం):**



రాష్ట్ర స్థాయి పంచాయితీరాజ్ సదస్సు బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో జరుగనున్నట్లు రాష్ట్ర పంచాయితీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవీబీ రాజేంద్రప్రసాద్ ప్రకటించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ సదస్సుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం, ఆంధప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్‌ల ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ సదస్సు జరగనుందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పార్టీలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్స్ పాల్గొనాలని రాజేంద్రప్రసాద్, లక్ష్మి ముత్యాలరావుల పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌ల నిధులు, అధికారాలను దొంగిలించి రూ.3 కోట్ల 50 లక్షల గ్రామీణ ప్రజలకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. అందుకే రాజకీయాలకతీతంగా సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్స్, కార్పొరేటర్స్ ఐక్యమై 16 డిమాండ్ల సాధన కోసం భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ చేపట్టనున్నట్లు వైవీబీ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు.

## జగన్ అక్రమాలను ఎండగట్టేలా సభలు



ఎన్టీఆర్ నినాదంతో మరోమారు ప్రజల్లోకి

రా కదలిరా..పిలుపుతో టిడిపి జనసభలు

జనసేన, టిడిపి ఉమ్మడిగా సభల నిర్వహణ

కొత్త లోగో విడుదల చేసిన పార్టీ నేత

పార్టీ అధ్యక్షుడు అచ్చన్నాయుడు వెల్లడి

**అమరావతి,జనవరి2(మరో ఉదయం):**

పార్టీ ఆవిర్భావం సందర్భంగా ఎన్టీఆర్ ఇచ్చిన రా కదలిరా పిలుపునే మళ్లీ ప్రజల్లోకి తీసుకెళు న్నామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వెల్లడించారు. స్వర్ణయుగం తెలుగుదేశంతోనే సాధ్యమనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నాం. అని ఆయన మీడియాతో అన్నారు. విధ్వంసాలు, వైఫల్యాలు తప్ప జగన్ పాలనలో అభివృద్ధి అనేది భూతద్దంలో వెతికినా కనిపించదని విమర్శించారు. రాష్ట్రాన్ని చీకటిమయం చేసి ఆంధ్రప్రదేశ్ ని ఆందోళనప్రదేశ్ గా మార్చిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని దుయ్యబట్టారు. 'అన్ని సభలు తెలుగుదేశం- జనసేన సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతాయి. చంద్రబాబు- పవన్ కళ్యాణ్ కలిసి పాల్గనే సభలు త్వరలోనే ప్రకటిస్తాం అన్నారు.పార్లమెంట్ స్థాయి బహిరంగ సభలతో సంబంధం లేకుండా మేనిఫెస్టో ప్రకటన సభను ప్రత్యేకంగా నిర్వహిస్తాం.. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చేందుకు ఎంతోమంది సంప్రదిస్తున్నారని తెలిపారు.కొత్త, పాత వారి సమన్వయం కోసం ఓ కమిటీ ఇప్పటికే పని చేస్తోంది. వైసీపీ నుంచి వచ్చే వారి పట్ల ఆచితూచి వ్యవహరిస్తామని అచ్చెన్నాయుడు అన్నారు.

మార్పు కోసం...
మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## గ్రామాల నిర్లక్ష్యంతోనే సమస్యలు

దేశ ఆర్థిక వ్యవస్థకు మూలాధారమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంపై ప్రభుత్వాలు చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదు. గ్రామాల్లో ఆర్థిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెరిగితేనే జాతీయ అభివృద్ధి సాధ్యమన్న కనీస పరిజ్ఞానం పాలకులకు లేకుండా పోతోంది. వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలను పెద్ద ఎత్తున్న ప్రోత్సహించే కార్యాక్రమాలు చేపట్టడం లేదు. దీంతో ఉద్యోగాల కోసం ప్తి ఒక్కరూ పట్టాణలపై ఆధారపడాల్సి వస్తుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటే దేశం బలంగా ఉంటుందన్నది చాణుక్యుడి కాలం నుంచి అమల్లో ఉంది. చాణుక్యుడు ఈ సూత్రం ఆధారంగానే గ్రామాలను బలోపేతం చేయాలని సూచించారు. ఆయన ఆర్థ శాస్త్రంలో ఎలాంటి ఆర్థిక వ్యవస్థ అవసరమో సూచించారు. ఎలాగైతే మన ఆర్థిక వ్యవస్థ బలపడుతుందో తెలిపారు. కానీ పాలకులు దానిని పాఠ్యపుస్తకాల్లోంచి తీసేసారు. తమ మెదళ్లోంచి తీసేసారు. దాన్ని అమలు చేయాలన్న విషయాలను మరిచారు. నిజానికి దేశం బాగుడాలంటే గ్రామాలు బలపడాలి. గ్రామాలు ఆర్థికంగా వృద్ది చెందాలి. వ్యవసాయం అందుకు ఆలంబన కావాలి. అన్నదాతలు ఆర్థికంగా బలపడితేనే అనుబంధ రంగాలకు ప్రాధాన్యం పెరుగుతుంది. అయితే వ్యవసాయికంగా మనం పంటల ఉత్పత్తిలో చూపిస్తున్న శ్రద్ధ వ్యవసాయ అనుబంధరంగాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో అన్ని విధాలుగా మనమంతా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ ఒక్క సూత్రాన్ని పాటిస్తే పంట ఉత్పత్తులతో పాటు..నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టడమే గాకుండా... గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడగలం. గ్రామస్థాయిలో ప్రణాళికలు రచించి అమలయ్యేలా కార్యాచరణ సాగడం లేదు. దీనికితోడు గ్రామాల్లో ఏం జరగాల్లో ఇక్కడి నుంచి రిమోట్ ద్వారా నిర్దేశించడం, కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించడం వంటి చర్యల కారణంగా ఇంకా వలసలు పెరిగి పట్టణాలపై ప్రజలు ఆధారపడుతున్నారు. ఈ కారణంగానే గ్రామాల్లో ఉపాధి, ఉద్యోగావకాశాలు రావడం లేదు. ఈ కారణంగానే గ్రామాల్లో కూలీల సమస్య తీవ్రంగా మారింది. గ్రామాలను నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రజలు పట్టణాలకు వలస వస్తున్నారు. దీంతో పట్టణాలపై భారం పడుతోంది. దీనిని ప్రభుత్వాలు గమనించడం లేదు. గ్రామీణ అర్థిక వ్యవస్థను బలోపే తానికి గ్రామాలు యూనిట్‌గా సర్పంచ్‌లను బాధ్యులను చేసేలా కార్యక్రమాల అమలు జరగడం లేదు. అన్నీ సచివాలయం నుంచి సిఎం పర్యవేక్షణలో జరగడం వల్ల గ్రామాలు వట్టిపోవడానికి కారణం అవుతున్నాయి. గ్రామాలకు కేంద్రం నుంచి వచ్చిన నిధులను మింగుతున్న వైనం సరికాదు. గ్రామాలపై ఇక్కడ పెత్తనం చేయడం వల్ల అవి అభివృద్ధి చెందడం లేదు. గ్రామాలను స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సాహించాలే తప్ప కర్రపెత్తనం చేయడం సరికాదు. ఆర్థికంగా పంచాయితీలు బలోపేతంగా లేక పోవడంతో పాటు, సర్పంచ్‌లు కూడా బాధ్యతారహితంగా వ్యవహారించడం వల్ల గ్రామాల్లో పారిశుద్య కార్యక్రమాలు మొదలు ఇతరత్రా కార్యక్రామలు బలంగా ముందుకు సాగడంలేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల కారణంగా గ్రామాల్లో లక్ష్యాన్ని సాధించడం లేదు. పారిశుద్యం, వీధులు శుభ్రంగా ఉంచుకోవడం, ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం తదితర అంశాలు సామాజిక బాధ్యత కావాలి. సర్పంచ్‌లకు అజమాయిషీ ఉండాలి. ఈ రకమైన చైతన్యం కోసం ఉద్యమించాల్సి ఉంది. పంచాయతీల్లో జనాభాకు సరిపడా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో పల్లెలో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రధానంగా అన్ని పనులను ప్రభుత్వంమే చేస్తుందన్న ధీమాలో ప్రజలు ఉన్నారు. ఓటుబ్యాంక్ రాజకీయాల కారణంగా ప్రజలు అచేతనంగా తయార య్యారు. వారిని బాధ్యులను చేసేలా చర్యలు ఉండడం లేదు. పరిశుభ్రత లోపించిన కారణంగానే వ్యక్తిగతంగానే గాక పరిసరాల శుభ్రతా

లోపించి అతిసారం, కలరా వంటి వ్యాధులు పెచ్చరిల్లుతున్నాయి. తాజాగా కరోనా ఇంకా విజృంభించడానికి పరిశుభ్రతా లోపం కూడా కారణంగా చూడాలి. కరోనాలాంటి వైరస్‌లను అరికట్టాలంటే పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. మురికివాడల వద్ద ఖాళీ ప్రదేశాలు,పొలం ప్రాంతాలు, గ్రామ శివారు స్థలాలు, రైలు పట్టాల పరిసరాల్లో కాలకృత్యాలు హానికరంగా పరిణమిస్తున్నాయి. ప్రధానంగా పారిశుధ్యం అన్నది పంచాయితీల సామాజిక బాధ్యతగా చేయాలి. స్వచ్ఛత అన్నది వ్యక్తిగత మైన శ్రద్ధకు సంబంధించినదే అయినా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో ఇలాంటి శ్రద్ధ తక్కువనే చెప్పాలి. వ్యక్తిగత మరుగదొడ్ల నిర్మాణాలు ఇంకా పూర్తి కావడం లేదు. కరోనా లాంటి వైరస్‌లు విజృంభించి అనారోగ్యాల బారిన పడుతున్నా ప్రజలు ఇందుకు కారణాలు అపరిశుభ్రత అని గ్రహించడం లేదు. గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. మురుగునీరు ఎక్కడపడితే అక్కడ వచ్చి చేరుతోంది. పారిశుద్య కార్యక్రమాల్లో ఏ గ్రామానికి ఆగ్రామ సర్పంచ్‌ను బాధ్యుడిని చేస్తే సరిపోయేది. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కోసం తొలిసారిగా ఆర్థిక చేయూత ఇవ్వడం ద్వారా గ్రామాల్లో కొంత మార్పు కనిపిస్తోంది. అయితే ఇప్పటికీ పూర్తిస్థాయిలో దీని కార్యక్రమం సాగడం లేదు. ఆరుబయట మలవిసర్జన కారణంగా మనదేశంలో అనారోగ్యకర వాతావారణం ఎక్కువే. అలాగే వ్యాధుల సంక్రమణ, అంటువ్యాధుల వ్యాప్తి కూడా ఎక్కువే. దీనికి ప్రజలతో పాటు ప్రభుత్వాల వైఫల్యం కూడా ఉంది. గ్రామ స్థాయిలో పనులకు సర్పంచ్‌లను బాధ్యులను చేయడం లేదు. వారికి ఆర్థిక స్వేచ్ఛను ఇవ్వడం లేదు. ఇకపోతే అనేక పథకాలకు ఆర్థిక చేయూత నిచ్చినా గ్రామాల్లో ప్రజల్లో పెద్దగా స్పందన రావడం లేదు. సర్పంచ్‌లకు బాధ్యతలు అప్పగించి గ్రామకమిటీ ద్వారా ఈ వ్యవహారం నడిపించివుంటే బాగుండేది. ఈ విషయంలో ఇరు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విఫలం అయినట్లే. చాలా పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులకు ప్రతినెలా వేలాది రూపాయల వేతనాలుగా అందిస్తున్నా ఫలితం మాత్రం కానరావడం లేదు. గ్రామాల్లో సర్పంచ్‌లు పటిష్టంగా పనిచేయడంతో పాటు ప్రణాళికలు సిద్ధం చేసేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలి. అప్పుడే ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది. సర్పంచ్‌లను, గ్రామ వార్డు సభ్యులను బాధ్యుల ను చేయడంతో పాటు, గ్రామాలను పరిపుష్టం చేసేలా కార్యక్రమాలను రూపొందించాల్సి ఉంది.

# పురాతన మండపాలకు జీర్ణోద్ధరణ

**అలిపిరి మండపం కోసం ఆర్కియాలజీకి రాసాం**

**మార్పులు చేస్తే తప్పేమిటన్న ఇవో ధర్మారెడ్డి**

**తిరుమల,జనవరి2(మరో ఉదయం):**

పురాతన మండపాలు శిథిలావస్థకు చేరుకుంటే మరమ్మతులు చెయొచ్చని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కూలిపోయే పరిస్థితి ఉంటే జీర్ణోద్ధరణ చెయ్యడంతో పాటు భక్తులకు అనువుగా మార్పులు చేయొచ్చన్నారు. దేశంలో చాలా ఆలయాల నిర్మాణాలు టీటీడీలో వేద విద్య అభ్యసించిన విద్యార్థుల సూచన మేరకు నిర్మిస్తున్నారని తెలిపారు. అలాంటిది టీటీడీలో పురాతన మండపాల శిథిలావస్థకు చేరుకుంటే మరమ్మతులు చెయ్యకూడదా అని ప్రశ్నించారు. అలిపిరి పాదాల మండపం వద్ద శిథిలావస్థకు చేరుకున్న మండపం పునర్నిర్మాణం కోసం ఆర్కియాలజీ అఫ్ ఇండియాకు ఇప్పటికే పలుమార్లు లేఖలు రాశామన్నారు. కడప జిల్లా సోమనాథ స్వామి ఆలయంలో గోడ కూలితే మరమ్మత్తుల కోసం ఆర్కాలజీ అఫ్ ఇండియాకు లేఖ రాసినప్పటికీ స్పందన లేదన్నారు. కొందరు రాజకీయ దురుద్దేశంతో గందరగోళం సృష్టించడం వల్ల అలిపిరి వద్ద మండపం పునర్నిర్మాణం ఆగిందని టీటీడీ ఈవో వెల్లడించారు. శేషాచల అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల ద్వారా జంతు కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నామని తెలిపారు. త్వరలోనే రూ.3.5 కోట్లతో ఆధునాతన కెమెరాలను కొనుగోలు చేస్తున్నామన్నారు. ఈ కెమెరాల ఏర్పాటుతో జంతు కదలికలను వెంటనే గుర్తించవచ్చని టీటీడీ ఈవో ధర్మారెడ్డి పేర్కొన్నారు. ఇదిలావుంటే వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని డిసెంబర్ 23 నుంచి పది రోజుల పాటు వైకుంఠ ద్వారాలను టీటీడీ తెరిచే ఉంచింది. వైకుంఠ ద్వారం గుండా గత పది రోజులుగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. పదిరోజుల్లో వైకుంఠ ద్వారాల గుండా స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య, హుండీ ఆదాయ వివరాలను టీటీడీ ఈవో ధర్మారెడ్డి మీడియాకు వెల్లడించారు. శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారాలు తెరిచిన 10 రోజుల్లో దాదాపు 6లక్షల 47వేల 452 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని ఈవో తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా 40వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారన్నారు. అలాగే శ్రీవారి హుండీ ద్వారా రూ.40.10 కోట్లు ఆదాయం లభించిందని చెప్పారు. 17.81 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాన్ని

స్వీకరించారని.. 35.60 లక్షల లడ్డులను భక్తులకు విక్రయించినట్లు తెలిపారు. 2లక్షల 13వేల మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారని టీటీడీ ఈవో ధర్మారెడ్డి వెల్లడించారు.

# విశాఖలో జిల్లా సహాయక నిధి ఏర్పాటు

**నెల జీతాన్ని విరాళంగా ఇచ్చిన కలెక్టర్**

**కలెక్టర్ ప్రకటనతో ముందుకు వచ్చిన ఉద్యోగులు**

**స్వచ్ఛందంగా రూ.14,22,368 విరాళాలు జమ**

**విశాఖపట్టణం,జనవరి2(మరో ఉదయం)**

నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా విశాఖ జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున ఔదార్యాన్ని చాటుకున్నారు. గొప్ప మానవత్వాన్ని ప్రదర్శించారు. తన నెల జీతం మెత్తాన్ని నిరుపేదలు, నిస్సహాయుల కోసం కేటాయించారు. అంతే కాదు అందరూ ఈ క్రతువులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దీంతో కలెక్టర్ పిలుపు మేరకు విశాఖపట్నం జిల్లాలో పనిచేస్తున్న వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగులు అందరూ నిరుపేదలు, నిరాశ్రయుల సహాయం కొరకు ఏర్పాటు చేసిన సంజీవనీ నిధి డిస్టిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు స్వచ్ఛందంగా రూ.14,22,368 విరాళాలుగా అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. స్వయంగా జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున నే తన ఒక నెల జీతం రూ.1,10,000/- అందజేసి తన పెద్ద మనుసును చాటుకోవడంతో మిగతా ఉద్యోగులు కూడా ఉద్యమంలా ముందుకు వచ్చారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయ సిబ్బంది రూ.12,000/-, రెవెన్యూ డిపార్టుమెంటులో విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, ఉద్యోగులు, ఏపీ రెవెన్యూ అసోసియేషన్, విశ్రాంత ఉద్యోగులు ఇతర వివిధ శాఖల ఉద్యోగులు రూ.2,85,845 చెక్కులను సంజీవని నిధి డిస్టిక్ట్ రిలీఫ్ ఫండ్ కి చెక్కులు, డీడీలు రూపంలో విరాళాలుగా అందజేశారు. ఈ మొత్తాన్ని నిరాశ్రయులకు ప్రత్యేక సందర్భాల్లో వైద్య ఖర్చులు, విద్య, పోషకాహారం తదితర అవసరాల కొరకు ఆర్థిక సహాయం అందించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. నిరుపేదలు, నిరాశ్రయులను ఆదుకొనేందుకు జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున సంజీవని నిధి పేరుతో గత ఏడాది జనవరి 1వ తేదీ డిస్టిక్ట్ రిలీఫ్ ఫండ్ (డీఆర్ఎఫ్)ను ఏర్పాటు చేశారు. కొత్త సంవత్సరం తొలిరోజున దీన్ని కలెక్టర్ ప్రారంభించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు తన వద్దకు వచ్చేవారు స్వీట్లు, పండ్లు, బొకేలు తేవద్దని, శక్తిమేర సంజీవని నిధికి విరాళమివ్వాలని అప్పట్లోనే పిలుపునిచ్చారు. అంతేకాకుండా గత ఏడాది కూడా తన వంతుగా ఒకనెల వేతనం రూ.1.10లక్షలు విరాళంగా ఇచ్చారు. గత ఏడాది కూడా కలెక్టర్ పిలుపునకు ఉద్యోగులు, అధికారులు స్పందించారు. ఒక్కరోజు వ్యవధిలో ఏకంగా రూ.10,92,998 జమ అయింది.

# దళితుల పట్లనే వైసిపిలో వివక్ష

**వ్యతిరేకత పేరుతో దళిత సీట్లు మార్చే యోచన**

**సిఎం జగన్ ఆదేశాల మేరకే పనిచేశాం**

**పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆగ్రహం**

**చిత్తూరు,జనవరి2(మరో ఉదయం):**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో టిక్కెట్ల కసరత్తు రాను రాను వివాదాస్పద మవుతోంది. నేరుగా సీఎం జగన్‌పైనే ఎమ్మెల్యేలు విరుచుకుపడుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు తన ఆగ్రహాన్ని ఆపుకోలేదు. తనపై వ్యతిరేకత ఉందని సీటు ఇవ్వనని చెబితే ఎలా కుదురుతుందని ఆయన ప్రశ్నించారు. తాను జగన్ చెప్పిన పనులన్నీ చేశానని ఆయన అన్నారు. జగన్ చెప్పిన పనులన్నీ చేసినప్పుడు అసంతృప్తి ఉంటే అది తనవల్ల ఎలా అవుతుందని ఆయన నిలదీశారు. తాను ఏం తప్పు చేశానో జగన్ పిలిచి చెప్పాలని ఎంఎస్ బాబు డిమాండ్ చేశారు. తాను జగన్ ను కలిసినప్పుడు వ్యతిరేకత ఉందని తనతో అన్నారని ఎంఎస్ బాబు మీడియాకు తెలిపారు. తనపై వ్యతిరేకత వచ్చిందంటే ఎవరిది బాధ్యత అని ఆయన ప్రశ్నించారు. జగన్ చెప్పినట్లే తాను గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో తిరిగానని అన్నారు. ఐదేళ్ళలో ఒక్కసారి కూడా మమ్మల్ని పిలిచి మాట్లాడలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ రకంగా సీఎం జగన్మోహన్ రెడ్డిపై పూతలపట్టు ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు ధిక్కార స్వరం వినిపించారు. దళితులకు జగన్ ఎలాంటి న్యాయం చేయలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నా బీసీ.. నా ఎస్సీ.. నా ఎస్టీ' అంటున్న జగన్ దళితుల పట్ల ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాబు మండిపడ్డారు. దళిత నియోజకవర్గంలోని ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేదంటూ ఎందుకు టికెట్ ఇవ్వకుండా నిరాకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఐదేళ్ల కాలంలో ఎమ్మెల్యేలను ఒక్క రోజు అయినా చేరదీసి జగన్ తమ మంచి చెడ్డా గురించి మాట్లాడిన పాపాన పోలేదన్నారు. ఐ ప్యాక్ సర్వేలో పనితీరు సరిగా లేదంటూ ఎక్కువగా దళిత నియోజకవర్గంలోనే మార్పులు ఎందుకు చేపడుతున్నారని అన్నారు. 2019 ఎన్నికల్లో ఐపెక్ సర్వేల ద్వారానే టికెట్లు ఇచ్చారా? పార్టీ కోసం కుటుంబాన్ని వ్యాపారాన్ని అన్ని వదులుకొని ఐదేళ్లు పార్టీ, ప్రజాసేవలో లీనమైపోయా. తాను అవినీతికి పాల్పడి భూకబ్జాలతో చెడ్డపేరు తెచ్చుకుంటున్నామన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాణిపాకంలోకి వచ్చి సత్యం చేస్తారా తాను అవినీతిని చేయలేదని? నేను కాణిపాకంలో సత్యం చేయడానికి సిద్ధం' అని ఎమ్మెల్యే తెలిపారు. గత అయిదేళ్లుగా నియోజకవర్గంలో పార్టీ పెద్దలు, మంత్రులు చెప్పినట్టే నడుచుకున్నా . ఇప్పుడు నాపై వ్యతిరేకత ఉంటే ఎవరిది భాధ్యత ? ఐదేళ్ళలో ఒక్కసారి కూడా మమ్మల్ని పిలిచి మాట్లాడలేదు. ఐప్యా క్ సర్వేలో తనకు అనుకూలంగా లేదని ..ఈ దఫా పూతలపట్టు టికెట్ ఆశించవద్దని సీఎం జగన్ చెప్పడం తగదు. డబ్బులు ఇస్తే ఐప్యాక్ వాళ్ళు సర్వే ఫలితాలు ఎలాగైనా మారుస్తారు. పార్టీలో టికెట్ల విషయంలో దళితులకు అన్యాయం జరుగుతోంది. ఇప్పటికీ వైసీపీపై నమ్మకం ఉంది. పార్టీ వీడే ప్రసక్తే లేదు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై గౌరవం ఉంది. ఆయన న్యాయం చేస్తారని ఆశిస్తున్నానని బాబు పేర్కొన్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్న ఓసిలను మార్చలేదని, కేవలం దళితుల పట్లనే అన్యాయం జరుగుతుందని ఆయన ఫైర్ అయ్యారు. దళితులు ఎమ్మెల్యేలుగా ఉన్న నియోజక వర్గాల్లోనే వారికి అన్యాయం జరిగిందని ఎంఎస్ బాబు అన్నారు. తాను చేసిన తప్పేంటో జగన్ చెప్పాల్సిందేనని అన్నారు. అయితే తాను వైసీపీలోనే కొనసాగుతానని, తనకు జగన్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి న్యాయం చేస్తారన్న నమ్మకం ఉందని ఆయన అన్నారు. దళితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. పార్టీలో టికెట్ల విషయంలో దళితులకు అన్యాయం జరుగుతుంద న్నారు. పూతలపట్టు నుంచి కుతూహలమ్మ కుటుంబానికి టిక్కెట్ ఇవ్వాలని సీఎం జగన్ భావిస్తున్నారు. ఎం.ఎస్ బాబును పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రోత్సహించారు. గత ఎన్నికల్లో ఆయనే టిక్కెట్ ఇప్పించారు. అయితే ఇప్పుడు టిక్కెట్ ఇవ్వడం లేదని నేరుగా సీఎం జగన్ పైనే విమర్శలు చేయడం ఆసక్తికరంగా మారింది. ఎక్కువగా రిజర్వుడు నియోజకవర్గాల అభ్యర్థులనే మారుస్తూండటంతో వైసీపీలో కూడా విస్తృత చర్చ జరుగుతోంది.

# ప్రజలకు చేరువగా కాంగ్రెస్ ప్రభుత్వం

**సమస్యల పరిష్కారం కోసం ప్రజాపాలన**

**ఖమ్మం పర్యటనలో మంత్రి పొంగులేటి**

**ఖమ్మం,జనవరి2(మరో ఉదయం):**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం ఉవ్వెత్తున నడుస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి మార్కెట్ యార్డు నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పేదవాడిని అన్ని రంగాల్లో అదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం ఎకైక ఎజెండా అని స్పష్టం చేశారు. ప్రజలు కోరుకునేదే ప్రభుత్వం చేస్తుందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా తప్పించుకోకుండా ఇబ్బందులను అధిగమించి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని తేల్చిచెప్పారు. మద్దులపల్లి మార్కెట్ యార్డు నిర్మాణం పేరుతో మట్టి దిబ్బలను తరలించి కొంత మంది కోట్ల రూపాయల సంపాందించారని ఆరోపించారు. అక్రమార్కులను వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. ఖమ్మంలో కోట్లు విలువచేసే భూమిని కబ్జా చేస్తే వారి నుంచి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆస్తి పేదలకు దక్కుతుందన్నారు. ఎవరైనా ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే తిరిగి అప్పగించాలని లేకుంటే ప్రభుత్వం తన పని తను చేసుకుంటూ పోతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు.




# బంగ్లాదేశ్ ఆర్థికవేత్త మహ్మద్ యూనస్‌కు జైలు

**కార్మిక చట్టాల ఉల్లంఘనపై కోర్టు చర్య**

**ఢాకా,జనవరి2(మరో ఉదయం):**

బంగ్లాదేశ్ ఆర్థిక వేత్త, నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ మహ్మద్ యూనస్ (83)కు కోర్టు సోమవారం ఆరు నెలల జైలు శిక్ష విధించింది. కార్మిక చట్టాలను ఉల్లంఘించినందుకు గారే ఆయనకు కోర్టు జైలు శిక్ష విధించింది. మరో ముగ్గురితో కలిసి ఆయన స్థాపించిన గ్రామీణ్ టెలికం సంస్థలో కార్మికుల సంక్షేమ నిధిని నెలకొల్పడంలో విఫలమైనట్లు మూడో కార్మిక న్యాయస్థానం జడ్జి షేక్ మరీనా సుల్తానా తీర్పు సమయంలో పేర్కొన్నారు. గ్రామీణ టెలికాం ఛైర్మన్‌గా చట్టాన్ని ఉల్లంఘించినందుకుగానూ అతని కంపెనీకి చెందిన మరో ముగ్గురు ఎగ్జిక్యూటివ్‌లతో పాటు యూనస్‌కు ఆరు నెలల సాధారణ లేదా కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ నలుగురిపై కార్మిక సంక్షేమ నిది సమకూర్చలేదనే ఆరోపణలు వచ్చాయి. కార్మిక చట్టాల్ని ఉల్లంఘించారంటూ కేసు నమోదైంది. దీంతో జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి 25 వేల బంగ్లా టాకాల చొప్పున జరిమానా కోర్టు విధించింది. జరిమానా చెల్లించడంలో విఫలైమైతే మరో 10 రోజులు అదనంగా జైలు శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది. తీర్పు అనంతరం యూనస్‌తోపాటు మిగతా ముగ్గురు బెయిల్ కోసం ప్రయత్నించారు. 5 వేల విలువైన టాకా బాండ్ సమర్పించగా న్యాయమూర్తి నెల రోజులపాటు బెయిల్ మంజూరు చేశారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించే వీలుంటుంది. బంగ్లాదేశ్‌లో జనవరి 7న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఈ పరిణామం చోటుచేసుకోవడం రాజకీయ ప్రేరేపితమనే ఆరోపణలు వస్తున్నాయి. కాగా డాక్టర్ మహ్మద్ యూనస్ పేదరిక వ్యతిరేక ప్రచారానికి గానూ 2006లో నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకున్నాడు. యూనుస్ కార్మిక చట్టం, నిధుల దుర్వినియోగానికి సంబంధించి పలు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు 2008లో అధికారంలోకి వచ్చిన షేర్ హసీనా ప్రభుత్వం ఈయన కేసులపై దర్యాప్తు ప్రారంభించింది. 2011లో గ్రామీణ బ్యాంకు కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించింది.యూనస్

గ్రామీణ టెలికాంతోపాటు అతను స్థాపించిన 50కిపైగా సామాజిక వ్యాపార సంస్థల నుంచి లాభం పొందుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అయితే వీటిని ఆయన ఖండించారు. వాటి ద్వారా తాను వ్యక్తిగత ప్రయోజనం పొందడం లేదని మీడియాకు తెలిపారు. అవమానించడం, వేధించడం లక్ష్యంగా ఆయనపై తప్పుడు కేసులు బనాయించారని యూసప్ లాయర్ అన్నారు. పలు కారణాల వల్ల ప్రస్తుతం అక్కడ అధికారంలో ఉన్న ప్రభుత్వంతో యూసఫ్‌కు మనస్పర్థలు ఉన్నట్లు తెలుస్తోంది. 2008లో అధికారంలోకి వచ్చిన తర్వాత షేక్ హసీనా నేతృత్వంలోని ప్రభుత్వం అతనిపై వరుస దర్యాప్తులను ప్రారంభించింది. 2011లో గ్రామీణ బ్యాంక్ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ పదవి నుంచి ఆయనను తొలగించింది.

# మేడారానికి పెరుగుతున్న భక్తుల రాక

## ముందే గద్దెలను దర్శించుకుంటున్న జనం

## ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జాతర

**ములుగు,జనవరి2(మరో ఉదయం):**

మేడారంలో జాతర సందడి నెలకొంది. ఇప్పటి నుంచే భక్తులు తరలి వచ్చి గద్దెల వద్ద పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి రెండు సంవత్సరాలకోసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున గిరిజన కుంభమేళా మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభం అవుతుంది. నాలుగు రోజులపాటు మేడారం జాతర ఘనంగా కొనసాగుతుంది. ఈ ఏడాది మేడారం జాతర ఫిబ్రవరి 21వ తేదీన మొదలై 24వ తేదీన ముగియనుంది. అయితే భక్తులు ముందే తరలివచ్చి వనదేవతలకు ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ములుగు జిల్లా లోని మేడారం అభయారణ్యంలో ప్రతి రెండు సంవత్సరాలకోసారి జరిగే వనదేవతల జాతర ఘనంగా జరుగుతుంది. నాలుగు రోజుల పాటు జరిగే పనదేవతల జాతరకు దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు చత్తీస్గడ్ జార్ఖండ్ నుండి గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటారు. సుమారు కోటి మంది భక్తులు తరలిరావడంతో నాలుగు రోజులపాటు మేడారం జనసంద్రంగా మారుతుంది. జాతర సమయంలో గిరిజన దేవతలకు మొక్కులు చెల్లించుకోవడం ఇబ్బంది అనుకున్న భక్తులు ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. జాతర సమయంలో గ్దదెల వద్ద మొక్కులు చెల్లించుకోవడం, మేడారంలో విడిది చేయడం కష్టం అనుకున్న భక్తులు సుమారు రెండు నెలల సమయానికి ముందుగానే తరలివచ్చి వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. జాతర సమయంలో గద్దల పైకి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో పాటు జనం కిక్కిరిసి లైన్లలో గంటలు తరబడి నిలబడాల్సి వస్తుంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని భక్తులు ముందుగానే తరలివచ్చి అమ్మవార్ల మొక్కులు చెల్లించుకుంటు న్నామని భక్తులు చెప్పారు. వనదేవతల జాతర ఈసారి బుధవారం రోజున ప్రారంభమై నాలుగో రోజు శనివారం వరకు కొనసాగుతుంది. అమ్మవార్లకు బుధవారం, ఆదివారం పవిత్ర రోజులుగా భావించే భక్తులు ముందస్తు మొక్కుల్లో భాగంగా ఆదివారం, బుధవారం రోజుల్లో పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. ప్రస్తుతం ఆదివారం, సోమవారం నూతన సంవత్సరం రెండు రోజులు సెలవులు రావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో మేడారానికి తరలివచ్చారు. వేములవాడలో తొలి దర్శనం చేసుకుని ఇక్కడకు భక్తులు వస్తుంటారు. జాతర సమయంలో భక్తుల రద్దీతో పాటు కరోనా మరోసారి విజృంభి స్తుండడంతో ముందుగానే వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నామని మరి కొంత మంది భక్తులు చెబుతున్నారు. గత 15 రోజులుగా బుధ, ఆదివారాలతో పాటు సెలవు రోజుల్లో రోజుకు లక్ష మంది భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. దీంతో ఇక్కడ ఏర్పాట్లు కూడా ముందస్తుగానే చేపట్టారు.

# ఆందోల్ అభివృద్ధికి మంత్రి అడ్డుపుల్ల

## మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

**సంగారెడ్డి,జనవరి2(మరో ఉదయం):**

అందోల్‌లో అభివృద్ధి పనులను ఆపాలని మంత్రి దామోదర రాజనర్సింహ చూస్తున్నారని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆరోపించారు. మంగళవారం ఆయన సంగారెడ్డిలో మీడియా సమావేశంలో మంత్రిపై నిప్పులు చెరిగారు. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆందోల్ నియోజకవర్గంలో ఎస్డీఎఫ్, సీడీపీ నిధులతో అభివృద్ధి పనులు చేశాను. 80 శాతం వరకు గ్రామాల్లో సీసీ రోడ్లు వేయించానని తెలిపారు. కొన్ని టెండర్లు పూర్తవగా మరికొన్ని పనులు నడుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పనుల్ని ఆపాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారని ఆరోపించారు. మంజూరు అయిన నిధులు సరిపోకపోతే ఇంకా నిధులు ఇవ్వండి. కానీ పనులను మాత్రం ఆపవద్దన్నారు. అభివృద్ధి పనుల్లో రాజకీయ కక్షసాధింపు చర్యలు సరికావని హితవు పలికారు. అభివృద్ధికి మంత్రి సహకరించాలని కోరారు.

# రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన జగన్

## అబివృద్ది పేరుతో విధ్వంసం చేశారు

## ఐదేళ్లుగా రాజధాని లేని రాష్ట్రంగా మిగిల్చారు

## జగన్ పాలనపై మాజీమంత్రి అయ్యన్న విమర్శలు

**విశాఖపట్టణం,జనవరి2(మరో ఉదయం)**

జగన్‌కి తండ్రి వైఎస్ రాష్ట్రాన్ని దోచుకోవడం మాత్రమే నేర్పారని, నాయ్యకత్వ లక్షణాలు బోధించలేదని మాజీమంత్రి అయ్యన్న పాత్రుడు విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రాన్ని లూటీ చేసి దోచుకున్నారని అందుకే 14 నెలలు జగన్‌ని జైల్లో పెట్టారన్నారు. అవినీతిపరులే నేడు నీతులు బోధిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సాగునీటి రంగంతో సహా అనేక రంగాల్లో అభివృద్ధి తెలుగుదేశం హయాంలోనే సాగిందన్నారు. హేతుబద్ధత లేకుండా రాష్ట్రాన్ని విభజించిన తరవాత చంద్రబాబు అహోరాత్రులు కష్టపడి ఎపిని ముందుకు తీసుకుని పోతే..దానిని ఇప్పుడు జగన్ తన ఐదేళ్ల పాలనలో పూర్తిగా నష్టపరిచారని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటైన రెండున్నర ఏళ్లలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామన్నారు. ఎన్నో అడుగులు పడ్డ ఎపిని జగన్ 20 ఏళ్ల వెనక్కి తీసుకుని వెళ్లారని మండిపడ్డారు. ఎన్నికల సందర్భంగా జగన్ అనేక హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక కేవలం కొన్ని మాత్రమే నెరవేర్చారు. అంటే.. 15 శాతం అమలు చేసి 85 శాతం ఫెయిల్ అయ్యారు. కానీ 99.5 శాతం హామీలు అమలు చేశానంటూ ప్రతి సభలోనూ సీఎం జగన్ అబద్దాలు చెబుతున్నారని అంటూ మాజీ మంత్రి విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన 120 సంక్షేమ పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు తరిమేశారన్నారు. రాజధానిని విధ్వంసం చేశారని విమర్శించారు. పోలవరాన్ని రివర్స్ చేయడం ద్వారా నదుల అనుసంధానానికి గండికొట్టి రాష్ట్రాన్ని కరువురక్కసికి బలిపెట్టారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సబ్‌ప్లాన్ నిధులు రూ. 1.14 లక్షల కోట్లు దారిమళ్లించి సామాజిక న్యాయం గొంతు కోశారని ధ్వజమెత్తారు. 2.30 లక్షల ఉద్యోగాల భర్తీపై మాట తప్పారన్నారు. అంగన్వాడీలకు తెలంగాణకన్నా అదనంగా రూ.1000 పెంచతానన్న హామీపై జగన్ మడమతిప్పారన్నారు. మద్యనిషేధం చేసి ఓటు అడుగుతానన్న హామీకి విరుద్ధంగా.. మద్యంపై ఆదాయాన్ని 15 ఏళ్లపాటు బ్యాంకులకు తాకట్టు పెట్టి అప్పు తెచ్చుకున్నారని గుర్తుచేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచనన్న హామీకి గండికొట్టి రూ.64 వేల కోట్ల భారాన్ని రాష్ట్రప్రజలపై మోపారన్నారు. సీపీఎస్ రద్దు, రైతు రుణమాఫీ, మద్యనిషేధం, అమరావతి అభివృద్ధి, ఇసుక అక్రమ తరలింపు అడ్డుకట్ట వంటి అనేక హామీలపై జగన్ మాట తప్పారన్నారు. అయినా, తాను 99.5 శాతం హామీలు అమలు చేశానంటూ అబద్దాలు చెప్పడం ఆయనకే చెల్లిందని అయ్యన్నపాత్రుడు విమర్శించారు. 'చంద్రబాబు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేదలను సొంత కాళ్లపై నిలబెట్టేలా చేశాయి. జగన్ సంక్షేమ పథకాలు పేదలను నిరుపేదలుగా చేసి ఓటు యంత్రాలుగా మార్చి



# ఎన్నికల ప్రచారానికి బాబు రంగం సిద్ధం

## 5 నుంచి ప్రజల్లోకి వెళ్ళేలా ప్రణాళిక

## పలు నియోజకవర్గాల్లో బహిరంగ సభలు

## 7న అచంట సభకు భారీగా ఏర్పాట్లు

**అమరావతి,జనవరి2(మరో ఉదయం):**

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారం వేగవంతం చేసింది. వచ్చే ఎన్నికల కోసం ఆపార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రచారం ప్రారంభించనున్నారు. ఎన్నికలకు గడువు దగ్గరపడుతుండటంతో ప్రజల్లోకి వెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాని తెలుగుదేశం పార్టీ నేతలు నిర్ణయించారు. దీనికోసం భారీ బహిరంగ సభలు నిర్వహించాలని పార్టీ ప్రణాళికలు సిద్ధం చేసింది. జనవరి 5 నుంచి 29 వరకూ మొత్తం 25 పార్లమెంట్ నియోజకవర్గాల్లో బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఈ బహిరంగ సభల్లో చంద్రబాబు పాల్గొన



నున్నారు. ఈనెల 18 మినహా మిగిలిన అన్ని రోజుల్లో సభలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించారు. ప్రతి రోజూ రెండు సభలు జరగనున్నాయి. అయితే ఈ సభలకు రా.. కదలిరా అనే టీడీపీ నాయకులు పేరు పెట్టారు. ఇదే పేరుతోనే అన్ని సభలు నిర్వహిస్తామంటున్నారు. ప్రతి సభలో చంద్రబాబు ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఈ బహిరంగ సభలకు కొన్ని చోట్ల పవన్ కళ్యాణ్ కూడా పాల్గొనే అవకాశం ఉంది.టీడీపీ ఇదిలావుంటే అధినేత చంద్రబాబు నాయుడు ఈనెల 7న ఆచంటలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా సభా స్థలి ఏర్పాట్లపై టీడీపీ నేతలు నిమగ్నమయ్యారు. టీడీపీ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి, జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, ఉండి ఎమ్మెల్యే రామరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మాజీ మంత్రి జవహర్, పీతల సుజాత ఆచంటకు చేరుకున్నారు. ఈ క్రమంలో నాయకులు, కార్యకర్తలకు టీడీపీ నేతలు దిశా నిర్దేశం చేసారు. ఆచంట నుంచే ఎన్నికల శంఖారావం చంద్రబాబు పూరిస్తారని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ వెల్లడించారు.చంద్రబాబు జిల్లాల వారి షెడ్యూల్ ఈ విధంగా ఉంది.

# సిఎం రేవంత్‌తో కూనంనేని తదితరుల భేటీ

**హైదరాబాద్,జనవరి2(మరో ఉదయం):**

సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సీపీఐ నేతలు కూనంనేని సాంబశివ రావు, నారాయణ, చాడ వెంకట్ రెడ్డి, ఇతర నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు మేలు చేసే ప్రతి పనిలో ప్రభుత్వానికి తమ వంతు సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలను



# లబ్దిదారులకు భూ పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**యాడికి, జనవరి 2, మరో ఉదయం :**

అనంతపురం జిల్లా కలెక్టర్ , జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశముల మేరకు యాడికి పట్టణంలోని ఎంపిడిఓ సమావేశ భవనంలో మంగళవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి 8 వ విడత బంజరు భూముల పట్టాలను లబ్దిదారులకు అందచేశారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కి నాయకులు ఘనస్వాగతం పలికినారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు రాష్ట్రాభివృద్ధి కోసం సి ఎం జగన్ సంక్షేమ పథకాలను ప్రజలను అందచేశారని, పేదల బతుకుల కోసమే భూపట్టాలను అందచేస్తూన్నారని తెలిపారు. అనంతరం 32 మందికి 42ఎకరాల పట్టాలను అందచేశారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ తహాశీల్ధార్ రాజ్ కుమార్ ,మాజీ జడ్పిటిసి వెంకటరామిరెడ్డి,బాల రమేష్ బాబు,అధికారులు,లబ్దిదారులు పాల్గోన్నారు.




# ఈ నెల 7 కోడూరు రామక్రిష్ణరెడి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్

**యాడికి, జనవరి 2 ,మరో ఉదయం :**

కోడూరు రామక్రిష్ణ జ్ఞాపకార్థముతో ఈ నెల 7 న అదివారం మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహకులు మాట్లాడుతు సంక్రాతి పండుగ సందర్భముగా క్రికెట్ టెన్నిస్ బాల్ టోర్నమెంటు ఈ నెల 7న ఆదివారం నుండి ప్రారంభమగునని తెలిపారు.ఈ పోటిలో గెలుపోందిన వారికి మొదటి బహుమతి గా రూ. 30,000 లను బొరుగుల విజయకుమార్ అందచేస్తున్నారని, రెండవ బహుమతి కింద రూ. 20,000 కోడూరు రామసుబ్బారెడ్డి అందచేస్తున్నారని, మూడవ బహుమతి కింద రూ. 10,000 రాగుల బాలచంద్రారెడ్డి అందచేస్తున్నారని తెలిపారు. యాడికి లోని వేములపాడు రోడ్డు నందు మార్కెట్ యార్డ్ గ్రౌండ్ పోటీలు ఉంటాయన్నారు. ఎంట్రీ ఫీజు రూ. 1000 అని, ఎంట్రీ ఫీజు ఆఖరితేది ఈ నెల 5 అని తెలిపారు. అంపైర్లదే తుది నిర్ణయం అని, ఎవరి కిట్టు వారే తెచ్చుకోవలేనని, బాలు మేనేజ్ మెంట్ వద్ద తీసుకోవలేనని తెలిపారు. మ్యాచ్ టై అయినచో సూపర్ ఓవర్ జరుపబడునని, మ్యాచ్కు టీషర్టు షర్టు ప్యాంట్ లోయర్ వేసుకొనిరావలెనని, ప్రతి టీం సభ్యులు 15 మంది మొదటిసారి ఇచ్చిన పేర్లు కలిగిన వారే ఆఖరి మ్యాచ్ వరకు రావలేనని, ప్రతి టీం సభ్యులు వారి ఆధార్ కార్డులు జీరాక్స్ మేనేజ్ మెంటకు ఇవ్వవలెనని తెలిపారు. ప్రతి మ్యాచ్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఇవ్వబడునని, మ్యాచ్ ఆఫ్ ది సీరిస్, టెస్ట్ బ్యాట్స్ మెన్, బెస్ట్ బోలర్ సైనల్ లో ఇవ్వబడునని, ప్రతి మ్యాచ్కు 12 ఓవర్లు ఉండును అని, సెమీఫైనల్ సైనల్ 20 ఓవర్లు జరుపబడునని తెలిపారు. తాడిపత్రి తాలుక మాత్రమే క్రికెట్ కీడకారులు రావలేనని తెలిపారు.వివరాల కోసం 9566194744, 8008822868, 9492964460కు సంప్రదించాలన్నారు.

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీతో కలిసి నడవడానికి సిద్ధంగా ఉన్నానని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి అన్నారు. కాంగ్రెస్ మాత్రమే సెక్యులర్ పార్టీ అని, దేశానికి కాంగ్రెస్ వల్లనే లబ్ది జరుగుతుందని నమ్ముతున్నానని అన్నారు. 'రేపే ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ అధిష్టానాన్ని కలుస్తున్నా. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతో కలిసి నడవాలని ఉద్దేశంతోనే తెలంగాణలో పోటీ చెయ్యలేదు. మా మద్దతుతోనే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలంగాణలో 31 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మేము పోటీ పెట్టకపోవడమే ప్రధానకారణం. కేసీఆర్ అరాచక పాలనను అంతమొందించేందుకు నా వంతు కృషి చేశాను. రెండు రోజుల్లో అన్ని విషయాలు.. అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్తా. కాంగ్రెస్ పార్టీలోకి చేరడం అయితే ఖాయం. నా కుమారుడి వివాహం సందర్భంగా మా తండ్రి ఆశీస్సులు తీసుకోవడానికి ఇక్కడికి వచ్చాను.' అని షర్మిల అన్నారు. అంతకుముందు ఆమె కుమారుడి పెళ్లి పత్రికను ఇడుపులపాయ తండ్రి సమాధివద్ద ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరుతున్నానని షర్మిల ప్రకటించారు. కుటుంబ సమేతంగా ఇడుపుల పాయ ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. కుమారుడు వైఎస్ రాజారెడ్డి వివాహ మొదటి పత్రికను వైఎస్ ఘాట్ వద్ద ఉంచారు. ఈ తర్వాత మీడియాతో మాట్లాడారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మనవడు వైఎస్ రాజారెడ్డి పెళ్లి కాబోతుందని.. ఈ సందర్భంగా వైఎస్సార్ సమాధి వద్ద వివాహ పత్రికను ఉంచి ఆశీస్సులు తీసుకోవడం జరిగిందన్నారు. వైఎస్సార్ తో పాటు ప్రజలందరి దీవెనలు కొత్త దంపతులపై ఉండాలని కోరుకున్నారు. కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేయాలని ఇది వరకే నిర్ణయించామని షర్మిల తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చామన్నారు. ఇవ్వాళ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిందన్నారు. కేసీఆర్ ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని దించడంలో వైఎస్సార్‌టిపి చాలా పెద్ద పాత్ర పోషించిందని గుర్తు చేశారు. 31 నియోజక వర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు 10 వేల లోపు మెజారిటీతోనే గెలిచారని.. దీనికి కారణం జాఖీ తెలంగాణ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయక పోవడమేనన్నారు. తమ పార్టీ ఎన్నికల్లో పోటీ చేసి ఉంటే కాంగ్రెస్ కి ఇబ్బంది అయి ఉండేదని గుర్తు చేశారు. ఈ కృతజ్ఞత భావం కాంగ్రెస్ పార్టీకి కూడా ఉందని తెలిపారు. మా త్యాగానికి విలువ నిచ్చి మమ్మల్ని కాంగ్రెస్ పార్టీలో చేరమని ఆహ్వానం పంపారని.. కాంగ్రెస్ లో చేరడానికి మాకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీ అతి పెద్ద సెక్యులర్ పార్టీ.. ప్రతి ఒక్కరికీ భద్రత ఇచ్చే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. అందుకే కాంగ్రెస్ పార్టీని బలపరచాలని నిర్ణయించుకున్నామన్నారు. బుధవారమే ఢిల్లీకి వెళ్తున్నాం.. ఒకటి రెండు రోజుల్లో అందరి ప్రశ్నలకు సమాధానం దొరుకుతుందని తెలిపారు. ఏపీలో రాజకీయాలపై ఇలా స్పందించారు. 4వ తేదీ ఉదయం 11 గంటలకు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల సమక్షంలో షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. అదే సమయంలో వైఎస్ఆర్టీపీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయనున్నారు. షర్మిలకు ఏపీ అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తారని కొద్దికాలంగా ప్రచారం జరుగుతుంది. అయితే, షర్మిలకు ఏఐసీసీ పదవి అప్పగిస్తారా? ఏపీ పీసీసీ పగ్గాలు అప్పగిస్తారా? అనే అంశంపై సస్పెన్స్ కొనసాగుతుంది. రాహుల్ గాంధీ షర్మిలకు ఏపీ పీసీసీ బాధ్యతలు అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. అలాకాకుంటే ఏఐసీసీ, సిడబ్ల్యుసీలో ఏదైనా ఒక పదవి ఇచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# రాయలచెరువులో జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం

**యాడికి ,జనవరి 2 ,మరో ఉదయం**

మండలంలోని రాయలచెరువు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంను సర్పంచు తలారి నాగేష్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచు అరుణ , ఎంపిడిఓ లక్ష్మినారాయణ మాట్లాడుతు రాష్ట్రంలో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సి ఎం జగన్ ఆశ అని తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షల ద్వారా ఆనారోగ్య సమస్యల్ని గుర్తించి వారికి ఉచితంగా వైద్యం , మందులు అందించడంతో పాటు రోగులకు సలహాలు సూచనలు ఇస్తారన్నారు.ఈ కార్యక్రమంలో సెక్రెటరీ అరుణ్ ,తలారి నాగేష్ , సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఏ ఎన్ ఏం లు ఆశా వర్కర్స్, అంగన్వాడి సిబ్బంది , గ్రామ ప్రజలు పాల్గోన్నారు.




# నేటినుంచి మరోమారు ప్రజల్లోకి భువనేశ్వరి

## నిజం గెలవాలి పేరుతో మూడు జిల్లాల్లో పర్యటన

**అమరావతి,జనవరి2(మరో ఉదయం):**

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి మరోసారి ప్రజల్లోకి వెళ్లనున్నారు. చంద్రబాబును అరెస్ట్ చేసి జైలులో పెట్టినప్పుడు 'నిజం గెలవాలి' పేరుతో ప్రజల్లోకి వెళ్లారు. దీంతో మంచి స్పందన లభించింది. ఇప్పుడు మరోమారు బుధవారం నుంచి మూడు రోజులపాటు భువనేశ్వరి నిజం గెలవాలి పేరుతోనే పర్యటనలు కొనసాగనున్నాయి. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నంలో భువనేశ్వరి పర్యటన కొనసాగనుంది. బుధవారం విజయనగరం జిల్లాలో,ఈనెల నాలుగన శ్రీకాకుళం జిల్లాలో, ఐదున విశాఖ జిల్లాలో భువనేశ్వరి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనస్థాపానికి గురై చనిపోయిన కుటుంబాలను పరామర్శించనున్నారు. ఇప్పటికే ఒకసారి వెళ్లి కొన్ని కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించిన విషయం తెలిసిందే. కాగా.. అక్రమంగా అరెస్ట్ అయిన చంద్రబాబు నాయుడు విడుదల కోసం సతీమణి భువనేశ్వరి చేసిన పోరాటం అంతా ఇంతా కాదు. చంద్రబాబు అరెస్ట్ నుంచి రాజమండ్రిలోనే ఉంటూ ప్రజలతో మమేకమ య్యారు. చంద్రబాబు విడుదల కోసం చేపట్టిన కార్యక్రమాల్లో భువనేశ్వరి చురుగ్గా పాల్గొన్నారు. ప్రజల్లోనే ఉంటూ.. వారి సాదకబాధలను కూడా అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా చంద్రబాబు అరెస్ట్ సందర్భంగా మనస్థాపంతో చనిపోయిన వారి కుటుంబాలను కూడా భువనేశ్వరి పరామర్శించారు.

మరో ఉదయం



# సినిమా వార్తలు

## ఏడేళ్ల జర్నీలో అన్నీ విజయాలే



అందుకే అతి తక్కువ సమయంలో నేషనల్ క్రష్‌గా అందరి మదిలో నిలిచిపోయింది రష్మిక మందన్నా. కన్నడ 'కిరాక్ పార్టీ'తో హీరోయిన్ గా కెరీర్ మొదలుపెట్టిన రష్మిక 'ఛలో' సినిమాతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చింది. తెలుగింట అతి తక్కువ సమయంలో స్టార్ హీరోల సరసన అవకాశాలు దక్కించుకుంది. చక్కని విజయాలు అందుకుంది. 'పుష్ప' చిత్రం సక్సెస్‌తో నేషనల్ క్రష్‌గా మారిపోయింది. ప్రస్తుతం తెలుగులో అగ్ర కథానాయికల్లో ఒకరిగా ఉంది. ఇటీవల 'యానిమాల్'తో బాక్సాఫీసు వద్ద భారీ విజయాన్ని అందు కుంది. రష్మిక సినీరంగంలోకి అడుగుపెట్టి ఏడేళ్లను విజయవంతంగా పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా తన సంతోషాన్ని అభిమానులతో పంచుకుంది. 'నా ఈ సినీప్రయాణంలో కొన్నిసార్లు వెనక్కితిరిగి చూసుకుంటే.. ఇదంతా ఎలా, ఎప్పుడు, ఎందుకు జరిగిందనిపిస్తోంది. సినిమా రంగంలోకి రావడం ఆనందంగా, గర్వంగా ఉంది. ఈ జీవితం కోసమే ఎన్నో కలలు కన్నాను. మంచి జీవితం కోసం పరుగులు తీస్తూనే ఉన్నాను. కానీ, సరైన వ్యక్తులు తోడుగా ఉండటం వల్ల ఆలోచించి అడుగులు వేయగలుగు తున్నాను. కలలు కంటూ పెరిగిన నేను సంతోషంగా, ప్రశాంతంగా ఉన్నాను. ఇలా లిటిల్ గర్ల్ తన కలల కోసం ఎదిగింది' అంటూ ఇనస్టాలో పోస్ట్ చేసింది. ప్రస్తుతం 'పుష్ప2', 'ది గర్ల్‌ఫ్రెండ్', 'ఛావా', 'రెయిన్‌బో' చిత్రాల్లో నటిస్తోంది రష్మిక.

**సినీ ప్రవేశం ఆనందంగా ఉందన్న రష్మిక**
**పాత్ర ఏదైనా..పరకాయ ప్రవేశం చేయడం.. పక్కింటి అమ్మాయిలా మెప్పించడం ఆమె నైజం.**

## సెగ పుట్టిస్తున్న అందాల అరియానా!

అందాలు ఆరబోస్తేనే..సినిమాకు అందం..అవకాశాలు సొంతం..చాలామంది ఇదే సూత్రాన్ని పాటించి సినీ పరిశ్రమలో అడుగుపెట్టి సక్సెస్ అవుతుంటారు.వివాదస్పద దర్శకుడు రాంగోపాల్ వర్మ పక్కన ఏ అమ్మాయి కనిపించినా పాపురల్ కావడం మాత్రం ఖాయం. అలా పాపులర్ అయిన అమ్మాయిలో అరియానా గ్లోరి ఒకరు. యూట్యూబ్ యాంకర్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఆమె ఆర్‌జీవీని హాట్‌హాట్‌గా ఇంటర్వ్యూ చేసి మరింత పాపులారిటీ తెచ్చుకుంది. ఆ క్రేజ్‌తో బిగ్ బాస్‌లో ఛాన్స్ కొట్టేసి ఇంకాస్త జనాల్లో గుర్తింపు పొందిండి. అంతే కాదు సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేసే హాట్ హాట్ ఫొటోలు కూడా యూతలో క్రేజ్ తీసుకొచ్చాయి. ఈ మధ్యన బీచ్‌లో బికినీ ధరించి పెట్టిన ఫొటోలు ఎంతగా వైరల్ అయ్యాయో తెలిసిందే. తాజాగా మరోసారి విజృంభించి అందాలు ఆరబోసింది అరియానా. తాజాగా పోస్ట్ చేసిన ఫొటోలతో సోషల్ మీడియాలో రచ్చరచ్చ చేస్తుంది. ఇదంతా సినిమాల్లో అవకాశాల కోసమే అని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. అయితే విమర్శలు ఎన్ని వచ్చినా అరియానా మాత్రం తగ్గట్లేదు. రోజు రోజుకు గ్లామర్ డోస్ పెంచుతుంది.. వెండితెరపై రాణించాలనే కోరికతో తరచూ అందాల ఆరబోతతో యువతకు నిద్ర లేకుండా చేస్తోంది. తన సొగసుతో మేకర్స్ చూపు తనవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నాలు చేస్తోంది. తాజాగా న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా ఎంజాయ్ చేస్తున్న ఈ అమ్మడు ఓ స్విమ్మింగ్‌పూల్ పక్కన టూ పీస్ డ్రెస్‌తో కెమెరాకు ఫోజ్ ఇచ్చింది. అందాలను చూపిస్తూ అందాల ఆరబోతలో తగ్గేదేలే అంటూ హాట్‌హాట్‌గా ఉన్న ఆ ఫొటోలను ఇనస్టాలో షేర్ చేసింది. ఆ ఫొటోలు చూసిన యువత ఫిదా అవుతున్నారు. ఈ హాట్ గర్ల్ అరియానా ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.



## జపాన్ భూకంపం కలచివేసింది


**అక్కడ దేవర షూట్ పూర్తి చేసుకున్న ఎన్టీఆర్**

జపాన్‌లో సంభ వించిన వరుస భూకంపాల ఘటనపై యంగ్ టైగర్ ఎన్టీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కొత్త ఏడాదికి ప్రజలందరూ స్వాగతం పలుకుతున్న వేళ జపాన్ ప్రజలు గుండెల్లో ఒక్కసారిగా అలజడి మొదలైంది. జపాన్‌లో షూటింగ్ ముగించుకొని సోమవారం రాత్రి తారక్ హైదరాబాద్ చేరుకున్నారు. వారం రోజులపాటు అక్కడ 'దేవర' చిత్రీకరణలో పాల్గొన్నారు. ఈ సినిమా చిత్రీకరించిన ప్రాంతంలో భూకంపం రావడం తన హృదయాన్ని కలచివేసిందని.. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు త్వరగా కోలుకోవాలని తారక్ ట్వీట్ చేశారు. "జపాన్ నుంచి ఇవాళే ఇంటికి వచ్చాను. అక్కడ భూకంపం గురించి తెలిసి షాక్ అయ్యాను. గత వారం అంతా అక్కడే ఉన్నాను. భూకంపం బారిన పడిన ప్రజల గురించి తలచుకుంటే గుండె తరుక్కుపోతోంది. వాళ్ళు త్వరగా కోలుకోవాలని ఆశి స్తున్నాను. జపాన్ ప్రజలందరూ ధైర్యంగా ఉండండి' అని ఎన్టీఆర్ ట్వీట్ చేశారు. సోమవారం జపానలో దాదాపు 21 సార్లు భూమి కంపించడంతో పశ్చిమ ప్రాంతం అస్తవ్యస్తం అయింది. ఆరుగురు మృతి చెందగా.. పలువురు గాయపడినట్ల అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం తారక్ దేవర చిత్రంతో బిజీగా ఉన్నారు. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తోంది. కొరటాల శివ దర్శకుడు. ఏప్రిల్ 5న ఈ చిత్రం విడుదల కానుంది.

## చెట్టాపట్టాలేసుకుంటున్న సిద్దార్థ్, అదితి రావు

### వెకేషన్ ట్రిప్ ఫొటోలతో నెట్టింట చర్చ

సిద్దార్థ్, అదితి రావు హైదరి మధ్య కుచ్ కుచ్ హోతా హై అని ఎప్పటి నుంచో టాక్ వినిపిస్తోంది. వీరిద్దరూ కలిసి అజయ్ భూపతి దర్శకత్వంలో 'మహా సముద్రం' చిత్రంలో నటించారు. అప్పుడే ఇద్దరి మధ్య ప్రేమ చిగురించిందని ప్రచారం నడుస్తోంది. ఓ సందర్భంలో అలాంటిది ఏమీ లేదంటూ సెలవిచ్చారు. కానీ తరచూ పార్టీలకు, షికార్లకు వెళ్తూనే కనిపించారు. హిట్ పాటలకు రీల్స్ కూడా చేశారు. ఇద్దరూ కలిసి ఎన్నోసార్లు కెమెరాకు చిక్కారు. తాజాగా మరోసారి ఈ జంట వార్తల్లో నిలిచారు. తాజాగా అదితీరావు హైదరీ సిద్దార్థ్‌తో ఉన్న ఫొటోను షేర్ చేసి 'హ్యాపీ బ్లెస్డ్ గ్రేట్‌ఫుల్' అని పోస్ట్ చేసింది. 'మ్యాజిక్ చేయాలంటే.. ఆనందం, ప్రేమ, నవ్వులు, ఇంద్రధనస్సు..ఉండాలి. ఇవన్నీ నీతోనే సాధ్యం అనే అర్థం వచ్చేలా ఆమె చేసిన పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. దీనిని చూసిన నెటిజన్లు ఇద్దరి మధ్య ఉన్న లవ్‌స్టోరీని అఫీషియల్‌గా చెప్పారనే ఊహల్లో ఉన్నారు. ఇంతకీ సిద్దార్థ్, అదితీల మధ్యనున్న ప్రేమకు ఇది అఫీషియల్ అనౌన్స్ మెంట్ అనుకోవచ్చా అంటూ ప్రశ్నలు సంధిస్తున్నారు. గతంలో ఓ ఇంటర్వ్యూలో సిద్దార్థ్‌తో డేటింగ్‌పై ప్రశ్న ఎదురైంది. దీనిపై ఆమె స్పందిస్తూ అలాంటిడి ఏమన్నా ఉంటే నేనే చెప్తానంటూ మాట దాటవేసింది. అయినా నేనేం చెప్పినా చివరకు మీకు నచ్చినట్లుగానే ఊహించుకుంటారుగా అని కౌంటర్ కూడా వేసింది. బొమ్మరిల్లు హీరోగా తెలుగు ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్రవేసుకున్న సిద్దార్థ్ 2023లో చిన్నా సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడని తెలిసిందే. సమ్మోహనం, మహాసముద్రం, వీ సినిమాలతో అందరికీ హాయ్ చెప్పింది అదితీరావ్ హైదరి.ఈ హైదరాబాదీ ముద్దుగుమ్మ సిద్దార్థ్‌తో కలిసి చక్కర్లు కొడుతూ.. నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తన బాయ్ ఫ్రెండ్ సిద్దార్థ్‌తో కలిసి న్యూ ఇయర్ వెకేషన్ ట్రిప్ వేసింది. ఇంతకీ ఈ ఇద్దరు ఎక్కడికెళ్లారనేది ప్రస్తుతానికి సస్పెన్స్ లో ఉండగా.. ఈ ఫొటోలు మాత్రం నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. మొత్తానికి ఈ క్రేజీ యాక్టర్లు 2024 సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా తమ రిలేషన్‌షిప్‌ను ఇలా అధికారికంగా ఫైనల్ చేశారంటూ ఇప్పుడు నెట్టింట తెగ చర్చించుకుంటున్నారు మూవీ లవర్స్.



Edited,printed,published and Owned by sredharPrinted at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com